ఆడలేక మద్దెల ఓడు!

శాఖల మధ్య సమన్వయ లోపం.. వైఫల్యాన్ని దాచి గతంపై నెపం

చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణపై కాంగ్రెస్ సర్కారు తీరిది • 2 నెలల్లో చెరువుల నోటిఫికేషన్ పూర్తి చేయాలని హైకోర్టు అక్షింతలు

గడువు ముంచుకురావటంతో గత ప్రభుత్వ వైఫల్యమంటూ బుకాయింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. నిర్ణీత గడువులోగా హెచ్ఎండీఏ పరిధిలో చెరువులు, కుంటల ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణ పూర్తి చేయాలని హైకోర్టు అక్షింతలు వేయగా, గడువు దగ్గర పడుతుండటంతో నెపాన్ని కప్పిపుచ్చుకునేలా గత ప్రభుత్వ వైఫల్యం అంటూ సన్నాయి నొక్కులతో కాలయాపన చేస్తున్నది. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న మొత్తం చెరువుల జాబితా, వాటి ఎఫ్టీఎల్, బఫర్‌జోన్లతోపాటు, హద్దురాళ్లను నిర్దేశిస్తూ నవంబర్‌లోగా తుది నోటిఫికేషన్ జారీ చేసిన నివేదికతో రావాలంటూ హెచ్ఎండీఏ కమిషనర్‌ను ఆగస్టులో కోర్టు ఆదేశించింది. ఇప్పటివరకు ఎఫ్టీఎల్ నిర్ధారణ, తుది నోటిఫికేషన్‌పై దృష్టిపెట్టని హెచ్ఎండీఏ యంత్రాంగం.. గత ప్రభుత్వ వైఫల్యంతోనే పూర్తి కాలేదని దుష్ప్రచారం చేయడం విడ్డూరం. చెరువుల పరిరక్షణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ సర్కారు మిషన్ కాకతీయ పేరిట చెరువులకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా కృషిచేసింది. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువుల ఆధునీకరణకు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) రూపొందించిన టెక్నాలజీ సాయంతో హద్దురాళ్లను నిర్ధారించేలా కీలక నిర్ణయం తీసుకున్నది. చెరువుల ప్రాథమిక, తుది నోటిఫికేషన్ వేగవంతం చేయటంలో ఎల్పీసీ సమావేశాల్లో అధికారులను పరుగులు పెట్టించింది. కానీ ఇరిగేషన్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం, 2010 కంటే ముందే అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు సంబంధిత చెరువుల రికార్డులను నిర్వీర్యం చేయటంతో తుది జాబితా జాప్యానికి కారణమైంది. కానీ ఉద్దేశపూర్వకంగా చెరువుల హద్దురాళ్లను బీఆర్ఎస్ సర్కారు ఖరారు చేయలేదంటూ సంబంధిత శాఖలతో బురద జల్లే ప్రయత్నానికి కాంగ్రెస్ పూనుకొన్నది. హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల పరిరక్షణకు ఉమ్మడి రాష్ట్రంలో 2010లో ఏర్పాటు చేసిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్పీసీ) అప్పటికే ఉన్న చెరువుల తుదిజాబితాను ఎందుకు పూర్తి చేయలేకపోయిందనేది ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తున్నది. ఎందుకంటే ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలోనే నగరంలోని ప్రధాన చెరువులు, కుంటలను అన్యాక్రాంతం చేయటంలో అప్పటి కాంగ్రెస్, టీడీపీ కంకణం కట్టుకుని దశలవారీగా లేక్ సిటీ మూలాలను తొలగించే కార్యకలాపాలను ప్రోత్సహించాయి. దీంతో 2013 నాటికి రూపొందించిన 'మాస్టర్ ప్లాన్–2031'లో వందల చెరువుల జాడ లేకపోవడం అప్పట్లో వివాదాస్పదంగా మారింది. దీనికి మాస్టర్‌ప్లాన్ రూపకల్పన బాధ్యతలను ఆర్వీ కన్సల్టెన్సీ సంస్థకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించటంలోనే అసలు మతలబు ఉన్నదని, దీంతోనే విలువైన చెరువులు, కుంటలు కాలగర్భంలో కలిసిపోవడానికి ప్రధాన కారణమని పెద్దఎత్తున కథనాలు వచ్చాయి. హైదరాబాద్‌కు చెందిన ఎంతోమంది పర్యావరణవేత్తలు గొంతెత్తారు. చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకుంటూ చెరువుల నిర్వీర్యానికి కారణాలను దాచిపెట్టే చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది.

రెండు నెలల్లో ముందుకు పడని అడుగులు

ఏడు జిల్లాల పరిధిలో విస్తరించిన హెచ్ఎండీఏ పరిధిలో 3,532కిపైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ, నిర్వహణ, పరిరక్షణ, ఆధునీకరణ కార్యకలాపాలన్నీ హెచ్ఎండీఏవే. చెరువు హద్దులను కాపాడటం కూడా దాని బాధ్యతే. 2013 నుంచి 2023 నాటికి 2,525 చెరువులకు ప్రాథమిక హద్దురాళ్ల ప్రక్రియ పూర్తయింది. మిగిలిన వాటిలో 230 చెరువులకు మాత్రమే బఫర్‌జోన్, ఎఫ్టీఎల్ నిర్ధారణ జరిగినట్టు తేలింది. బఫర్ జోన్, ఎఫ్టీఎల్ ఎందుకు ఖరారు చేయాలని హెచ్ఎండీఏను ప్రశ్నించిన హైకోర్టు.. నవంబర్‌లోగా మిగిలిన 1,000 చెరువులకు హద్దుల నిర్ధారణకు ఆగస్టులో ఆదేశాలు ఇచ్చినా అధికారులు ఆ దిశగా అడుగులే వేయలేదు. ఆక్రమణల లెక్కలనూ వెలికి తీయలేకపోయారు. నెల గడువులోగా తుది జాబితా తయారవడం అసాధ్యంగా మారవటంతో ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొనేందుకు గత ప్రభుత్వంపై రాళ్లు వేయటం మొదలుపెట్టింది. ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణను బీఆర్ఎస్ సర్కారు ఉద్దేశపూర్వకంగానే చేయలేదంటూ అసత్య ప్రచారానికి తెరలేపింది.

2010 నాటికే చెరువులు మాయం

హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల పరిరక్షణపై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుపడుతున్నది. కానీ ఉమ్మడి పాలనలో మాస్టర్ ప్లాన్–2031లోనే వందల చెరువులను లేకుండా చేసింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే. అప్పట్లోనే దీనిపై పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. తుది మాస్టర్ ప్లాన్‌లో ఉన్న చెరువులు, కుంటలు మాయమయ్యాయి. సైబరాబాద్ పరిధిలో 10సంఖ్యలో హద్దురాళ్లు, ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ విషయంలో చెరువుల నోటిఫికేషన్‌ను తారుమారు చేసిన ఆర్వీ కన్సల్టెన్సీ సమగ్రంగా విచారించకుండా మాస్టర్‌ప్లాన్ చేసిందనే ఆరోపణలున్నాయి. వందల చెరువుల వెంటభారీ భవంతులు వెలిశాయని జలవనరుల నిపుణులు తెలిపారు.

క్షేత్రస్థాయి ఇబ్బందులపై అవగాహన లేకుండా..

2010లో లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటుచేసిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం.. తొలి సమావేశంలో 21 చెరువుల డిమార్కేషన్, హద్దురాళ్ల నిర్ధారణ, ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణ చేపట్టాలని భావించింది. ఆ జాబితా ప్రకారం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వెంబడి గ్రీన్ బెల్ట్ డెవలప్ చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణ కాక యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, పీసీబీ, మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్, అటవీ, కలెక్టర్లు, టౌన్‌ప్లానింగ్, పర్యావరణవేత్తలు వంటి 18 సభ్యులతో ఏర్పాటైన నూతన కమిటీ ఆధ్వర్యంలో జరిగిన తొలి ఎల్పీసీ సమావేశంలోనే సాధకబాధకాలపై చర్చించారు. సమన్వయం లేకపోతే మాస్టర్‌ప్లాన్, లేక్ పరిరక్షణ సాధ్యం కాదని ఆర్వీ కన్సల్టెన్సీ కుండబద్ధలు కొట్టినట్టు తెలిసింది. కానీ అధికారులు తూతూమంత్రంగా ఎల్పీసీ సమావేశాలు నిర్వహించి చేతులెత్తేశారు. దీంతో నగరంలో చెరువుల హద్దురాళ్ల నిర్ధారణ జాప్యానికి బీజం వేసిందే కాంగ్రెస్ పార్టీగా ముద్ర పడింది.

ముంచుకొస్తున్న గడువు

మరో నెలలో హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువుల తుదిజాబితా ప్రక్రియ పూర్తి చేయాలన్న గడువు ముంచుకొస్తున్నది. నవంబర్ నాటికి తుదిజాబితాతో నివేదికను అందజేయాల్సి ఉండగా.. చెరువుల నిర్ధారణ చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసింది. ఎల్పీసీ తొలి సమావేశంలోనే ఇబ్బందులపై చర్చించగా, అప్పటి సమావేశానికి రంగారెడ్డి కలెక్టర్ హోదాలో ప్రస్తుత మున్సిపల్ శాఖ సెక్రటరీ కూడా హాజరయ్యారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణలో సమస్యలను పరిష్కరించి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా.. ఆ పని చేయలేక ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పబ్బం గడుపుతున్నదని హైదరాబాద్‌లోని జలవనరుల నిపుణులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మ్యాప్స్ ఇన్‌ఫ్రా కేసుపై వివరణ ఇవ్వండి

- పోలీసులకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం నిజాంపేటలో ఎర్రకుంట ఎఫ్టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారంటూ మ్యాప్స్ ఇన్‌ఫ్రాపై నమోదు చేసిన క్రిమినల్ కేసు వివరాలు ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఆక్రమణలపై నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును రద్దు చేయాలని కోరుతూ మ్యాప్స్ ఇన్‌ఫ్రా పిటిషన్ దాఖలు చేసింది. ఆ సంస్థ మేనేజింగ్ పార్ట్నర్ సీ సుధాకర్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ కే సుజన బుధవారం విచారించారు. తాము కొనుగోలు చేసిన భూమిలోనే నిర్మాణాలు చేపట్టామని, తప్పుడు కేసులు నమోదు చేశారని న్యాయవాది పేర్కొన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి వివరణ ఇవ్వాలంటూ బాచుపల్లి పోలీసులకు ఇరిగేషన్ శాఖ ఏఈఈకి నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేశారు.

28న 'చలో హైదరాబాద్'

- గిరిజన గురుకుల టీచర్ల వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): కొత్త టైం టేబుల్ వద్దని, పాత టైంటేబుల్‌నే అమలు చేయాలని గిరిజన గురుకుల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలని ఈనెల 28న 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు స్పష్టంచేశారు. ఈ సందర్భంగా గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు రిషికేష్‌కుమార్, సురేందర్ రాథోడ్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో ఉన్న టైంటేబుల్‌ను కాదని కొత్త టైంటేబుల్‌ను అమల్లోకి తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికంతటికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని స్పష్టంచేశారు. మరో 11 సమస్యలు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని పేర్కొన్నారు.

'నాలుగు డీఏలను విడుదల చేయండి'

హైదరాబాద్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ): దసరా పండుగను పురస్కరించుకుని పెండింగ్‌లోని నాలుగు డీఏలను విడుదల చేయాలని పెన్షనర్ల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. 20న నిర్వహించే మంత్రిమండలి సమావేశంలో పెండింగ్ డీఏలపై నిర్ణయం తీసుకోవాలని కోరింది. జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టీ శుభాకర్‌రావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కాలయాపనే తప్ప ఇంతవరకు ఒక్క సమస్యను పరిష్కరించలేదని, ఆర్థిక సంబంధంలేని అంశాలనూ పరిష్కరించడంలేదని ఆరోపించారు. పెండింగ్ బిల్లుల మంజూరు, డీఏల విడుదల, ఈహెచ్ఎస్ పథకాన్ని అమలు చేయాలని కోరారు.

ముగ్గురు గురుకుల విద్యార్థుల అదృశ్యం

దేవరకొండ రూరల్, సెప్టెంబర్ 18: మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అదృశ్యమైన ఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో జరిగింది. మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ముజీబ్, తౌఫిక్‌ఉమర్, అబ్దుల్ రెహమాన్ 16న పాఠశాలకు సెలవు కావడంతో బయటి నుంచి కల్లు తెచ్చుకున్నారు. స్టాఫ్‌నర్స్ జ్యోతి ప్రిన్సిపాల్ అశోక్‌కు తెలపడంతో భయపడిన విద్యార్థులు మంగళవారం ప్రహరీ దూకి పారిపోయారు. పెట్టెలను వెతకగా 'మమ్మల్ని పాఠశాలలో టార్చర్ పెడుతున్నారు.. అందుకే పారిపోతున్నాం.. మా కోసం ఎవరూ వెతకొద్దు' అని రాసి ఉన్న లెటర్ లభించింది.

తొలి జీతమే చేదు జ్ఞాపకం!

- గురుకులాల్లో వేతన వెతలు
- కొత్త ఉద్యోగులకు అందని జీతం
- రెగ్యులర్ ఉద్యోగులదీ అదే గతి
- ఔట్‌సోర్సింగ్ మరీ దయనీయం
- మూడు నెలలుగా జీతాల్లేవ్
- అప్పలతోనే జీవనయానం
- పడిపోతున్న సిబిల్ స్కోర్లు..
- ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగులు సతమతం

తొలి వేతనం అందలె..

హైదరాబాద్, సెప్టెంబర్18 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగంలో చేరి తొలి వేతనం అందుకున్న రోజున పొందే ఆనందమే ఆనందం. తొలి వేతనంతో అమ్మానాన్నలకు బట్టలు కొనడం, ఇతర కుటుంబసభ్యులకు స్వీట్స్, గిఫ్ట్స్ ఇవ్వడం ఇలాంటి దృశ్యాలు దాదాపు ప్రతి కొత్త ఉద్యోగి ఇంట్లో సర్వసాధారణం. కానీ, గురుకుల విద్యాసంస్థల్లో ఇటీవల ఉద్యోగం పొందినవారికి ఆ అనుభూతి లేకుండా పోయింది. ఉద్యోగంలో చేరి దాదాపు రెండు నెలలు అవతున్నా తొలి వేతనం అనేది అందని ద్రాక్షపండుగానే మిగిలిపోయింది. జూలైలో ఉద్యోగంలో చేరినవారికి ఇంకా తొలి వేతనమే అందలేదు. జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ఒక్క కొత్త ఉద్యోగులదే కాదు.. పాత ఉద్యోగులదీ అదే కథ. గురుకులాల్లోని రెగ్యులర్ ఉద్యోగులకు కూడా సెప్టెంబర్ 1న అందాల్సిన జీతం ఇంకా రాలేదు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా జీతాల్లేవు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.. ఇంకా నిధులు విడుదల కాలేదని ఉన్నతాధికారులు చెప్తున్నారు. దీంతో అప్పులతోనే కాలం వెళ్లదీయాల్సి వస్తున్నదని గురుకుల ఉద్యోగులు, సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లోని టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్, పీడీ, లైబ్రేరియన్ తదితర పోస్టుల్లో ఇటీవల 8,307 మందికి రెగ్యులర్ ఉద్యోగాలొచ్చాయి. అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న వారంతా దాదాపు జూలై చివరి వారం నుంచి విధుల్లో చేరారు. వారెవరికీ ఇప్పటివరకూ వేతనాలు చెల్లించలేదు. నూతనంగా విధుల్లోకి చేరిన ఉద్యోగుల వివరాల నమోదు, బ్యాంక్ ఖాతాలు, సర్వీస్‌బుక్ ఎంట్రీ తదితర పనులన్నీ వెంటవెంటనే పూర్తి చేసిన సొసైటీలు వారికి వేతనాలను మాత్రం విడుదల చేయలేదు. జూలైలో పనిచేసిన రోజులతోపాటు ఆగస్టు నెల పూర్తి వేతనాన్ని సెప్టెంబర్ 1 తేదీన చెల్లించాల్సి ఉన్నది. కానీ, 18వ తేదీ వరకు కూడా జీతం పడలేదు. మొదటి నెల వేతనంతో తల్లిదండ్రులకు, అన్నదమ్ములకు, అక్కచెల్లెళ్లకు కానుకలిచ్చి మధురస్మృతిగా నిలుపుకోవాలని భావించిన నూతన ఉద్యోగులకు అది ఆడియాశగానే మిగిలింది.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా..

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ) పరిధిలోని పాఠశాలలు, కాలేజీలు, సీవోఈల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలను చెల్లించడం లేదు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం, గెస్ట్‌ఫ్యాకల్టీ, హానరోరియం ఇలా వివిధ రూపాల్లో 3,500 మందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నారు. బోధన, బోధనేతర విధులను నిర్వర్తిస్తున్నారు. సదరు సిబ్బందికి జూన్, జూలై, ఆగస్టు వేతనాలను ఇప్పటికీ చెల్లించ లేదు. దీనిపై సొసైటీ ఉన్నతాధికారులు సైతం ఊసెత్తడం లేదు. వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తున్నదని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సోషల్‌వెల్ఫేర్ రెగ్యులర్ ఎంప్లాయీస్‌కూ పడలే..

గురుకులాల్లోని ఇతర రెగ్యులర్ ఉపాధ్యాయుల పరిస్థితి సైతం దయనీయంగా తయారైంది. ఒకటో తేదీన వేతనం అందుకోవడం అందని ద్రాక్షగానే మారింది. సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లోని రెగ్యులర్ సిబ్బందికి సైతం ఇప్పటికీ వేతనాలు జమ కాలేదు. మైనార్టీ గురుకుల సిబ్బందిలో కొంతమందికి బుధవారం సాయంత్రం తరువాత జీతం పడ్డట్టు సమాచారం. ప్రతి నెలా ఇదే పరిస్థితి ఎదురవుతున్నదని, ఏ తేదీన వేతనం వస్తుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వేతనాలను సకాలంలో విడుదల చేయకపోవడంతో బ్యాంకు లోన్లు కట్టలేకపోతున్నామని, చెక్‌బౌన్స్‌లతో ఈఎంఐలు మిస్ అయ్యి అదనంగా జరిమానాలు చెల్లించాల్సి వస్తున్నదని రెగ్యులర్ ఉపాధ్యాయులు చెప్తున్నారు. సొసైటీ ఉన్నతాధికారుల తీరుతో సిబిల్‌స్కోర్లు సైతం దారుణంగా పడిపోయాయని, అప్పు కూడా పుట్టని పరిస్థితి ఎదురవుతున్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లిస్తున్నట్టే, తమకు కూడా ఒకటో తేదీన వేతనాలను 010 పద్దు ద్వారా చెల్లించాలని గురుకుల సిబ్బంది కోరుతున్నారు.

గురుకులాల సమస్యలను పరిష్కరించాలి

- పనివేళలను తక్షణమే మార్చాలి
- గురుకుల విద్యాజేఏసీ డిమాండ్
- రెండోరోజూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గురుకులాల విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఇటీవల జారీచేసిన పనివేళలను మార్చాలని గురుకుల విద్యాజేఏసీ డిమాండ్ చేసింది. గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు రెండో రోజు కొనసాగాయి. అన్ని గురుకులాల్లో బోధన, బోధనేతర ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం విధులకు హాజరయ్యారు. సమస్యలను ఎన్ని సార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని జేఏసీ నేతలు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి తక్షణం స్పందించాలని, అశాస్త్రీయంగా రూపొందించిన పనివేళలను సవరించాలని, అందరికీ 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని, విద్యార్థుల డైట్ చార్జీలు పెంచాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, కాంట్రాక్ట్, గెస్ట్, పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, బేసిక్ పే వర్తింపజేయాలని, అన్ని గురుకుల సొసైటీలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ఏకరూప నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో గురుకుల విద్యాజేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు సీహెచ్ బాలరాజు, యాదయ్య, రుషికేశ్‌కుమార్, ప్రభుదాస్, చలపతి, బాలస్వామి, గోవర్ధన్‌రెడ్డి, ఝాన్సీరాణి, సాంబలక్ష్మి, ఆవుల సైదులు, జానీమియా, శ్రీనివాస్, గురుకులాల బోధన, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు. అటు.. నిరసనల్లో భాగంగా గురువారం సంతకాల సేకరణ చేపట్టి ప్రిన్సిపాల్స్ ద్వారా సొసైటీల కార్యదర్శులకు తమ డిమాండ్లను పంపించాలని సిబ్బందికి జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

మాడల్ టీచర్లకు పదోన్నతులు కల్పించండి: టీఎంఎస్‌టీఏ

హైదరాబాద్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ): మాడల్ స్కూల్ టీచర్లకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ మాడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌టీఏ) ప్రభుత్వాన్ని కోరింది. పరస్పర బదిలీలకు అవకాశం కల్పించి, ఖాళీలున్న చోటికి బదిలీ చేయాలని విజ్ఞప్తిచేసింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను సచివాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. బదిలీలపై ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది.

ఫైన్ ఆర్ట్స్‌కు అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ స్థలం

- పదెకరాల స్థలాన్ని కేటాయించనున్న సర్కారు
- మాసాబ్‌ట్యాంక్ నుంచి జేఎన్ఏఎఫ్‌ఏయూ తరలింపు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఓపెన్‌వర్సిటీ ఉద్యోగ సంఘాలు
- నేడు ముఖ్యమంత్రి వద్దకు ఉద్యోగ సంఘాల నేతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): దేశంలోనే ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సుల నిర్వహణకు ఏర్పడ్డ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ)ని మరో చోటికి తరలించేందుకు రంగం సిద్ధమైంది. మాసాబ్ ట్యాంక్‌లో ఉన్న ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీని జూబ్లీహిల్స్‌లోని అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీలోకి తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జూబ్లీహిల్స్‌లోని బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి చెందిన పది ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను శుక్రవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఎదుట పెట్టనున్నారు. రాష్ట్ర క్యాబినెట్ ఇందుకు ఆమోదం తెలుపడం లాంఛనంగానే కనిపిస్తున్నది. ఈ ప్రతిపాదనలను అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇది ఓపెన్‌వర్సిటీని నిర్వీర్యం చేసి కాలగర్భంలో కలిపే ప్రయత్నమని, దీనిని అడ్డుకుని తీరుతామని హెచ్చరిస్తున్నాయి.

క్రమంగా కుంచించుకుపోతున్నా..

బీఆర్ అంబేద్కర్ వర్సిటీని 1982లో ఏర్పాటుచేశారు. ఈ వర్సిటీకి మొదట్లో 53.63 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలమంతా కొండలు, గుట్టలతో కూడుకొని ఉండటంతో అతికష్టం మీద నిర్మాణాలు చేపట్టి వర్సిటీకి ఒక రూపునిచ్చారు. దీనిలో కొంత కబ్జాకు గురయింది. మరికొంత స్థలాన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు, ఒక విభాగం ఆఫీసర్ల క్వార్టర్ల కోసం కేటాయించారు. ఆ తర్వాత టీ–శాట్, వీ–హబ్ కోసం కూడా వర్సిటీ స్థలాన్ని కేటాయించారు. వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి (ఎస్సార్డీపీ)లో భాగంగా దుర్గంచెరువు బ్రిడ్జి కోసం మరికొంత స్థలాన్ని తీసుకున్నారు. ఇలా దాదాపు 13–14 ఎకరాల స్థలాన్ని వర్సిటీ కోల్పోయింది. వర్సిటీలో ఏటేటా అడ్మిషన్లు పెరుగుతున్నాయి. వర్సిటీ క్యాంపస్‌లోనే థియరీ తరగతులు, ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. కొన్ని కోర్సుల పరీక్షలను సైతం వర్సిటీలోనే నిర్వహిస్తున్నారు.

విద్యాకమిషన్‌కు జేఎన్ఏఎఫ్ఏయూ

మాసాబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూను జూబ్లీహిల్స్‌కు తరలించనుండగా, ఖాళీ అయిన జేఎన్ఏఎఫ్ఏయూ క్యాంపస్‌ను విద్యాకమిషన్ కార్యాలయం కోసం కేటాయించనున్నట్టు తెలిసింది. విద్యా కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళిని ఇటీవలే నియమించగా, సభ్యులను నియమించాల్సి ఉన్నది. ఆ తర్వాత కమిషన్ కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి. విద్యాకమిషన్ కార్యాలయానికి తొలుత బషీర్‌బాగ్‌లోని ఎస్సీఈఆర్టీ భవనంలో మూడో అంతస్తును కేటాయించాలని భావించారు. కానీ ఇటీవలే ఈ కార్యాలయాన్ని ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డికి కేటాయించారు. దీంతో జేఎన్ఏఎఫ్ఏయూను బీఆర్ అంబేద్కర్ వర్సిటీకి తరలించి, మాసాబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ భవనాలను విద్యాకమిషన్, తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయాల కోసం వినియోగించనున్నట్టు తెలిసింది.

వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు

బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి చెందిన స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించడాన్ని వర్సిటీ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వర్సిటీకి చెందిన టీచర్స్, ఫ్యాకల్టీ టీచర్స్ అసోసియేషన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్లు ప్రభుత్వ చర్యను తీవ్రంగా తప్పుబడుతున్నాయి. ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతున్నాయి.

హైరైజ్ పైకి హైడ్రా బుల్డోజర్లు!

- బాచుపల్లి కోమటికుంటలో ప్రముఖ నిర్మాణ సంస్థపై చర్యలకు రంగం సిద్ధం

నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబరు 18 (నమస్తే తెలంగాణ): హైడ్రా ఇప్పుడు హైరైజ్ బిల్డింగ్‌లపై ఫోకస్ పెట్టిందా? చెరువుల ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టిన ఆకాశ హర్మ్యాలను నేలమట్టం చేయాలని భావిస్తున్నదా? అంటే అవుననే అంటున్నాయి హైడ్రా వర్గాలు. విపత్తు నిర్వహణ, ఆస్తుల రక్షణకు ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) గడచిన కొంత కాలంగా చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, జంట జలాశయాల ఎఫ్టీఎల్‌లోని కట్టడాలను, పార్కు స్థలాల్లో 262 నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాలు స్వాధీనం చేసుకున్నది. 23 చోట్ల జరిపిన ఈ కూల్చివేతల్లో సామాన్యుడిపైనే హైడ్రా ప్రతాపం చూపిందంటూ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ అపవాదు నుంచి బయటపడేందుకు ఓ ప్రముఖ సంస్థనిర్మాణాలను కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు. బాచుపల్లిలోని కోమటికుంట చెరువు (లేక్ ఐడీ నంబర్ 2822) ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమంగా 8, 9వ బ్లాక్ నిర్మాణ పనులు చేపడుతున్న నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. హైడ్రా అధికారుల బృందం ఇటీవల సంబంధిత నిర్మాణ సంస్థ చేపడుతున్న స్థలాన్ని పరిశీలించింది. ఎఫ్టీఎల్, బఫర్‌జోన్లలోనే 8,9వ బ్లాక్‌లు కడుతున్నట్టు గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ సంస్థకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ బ్లాక్‌ల నిర్మాణం నిలిపివేయాలని ఆదేశించి నా ఆ సంస్థ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నట్టు గుర్తించారు. ఈ క్రమంలోనే లీగల్ సమస్యలు తలెత్తకుండా హైడ్రా నిశితంగా పరిశీలన చేస్తున్నది. 20వ తేదీ తర్వాత హైడ్రా విధివిధానాలు పూర్తిగా ప్రభుత్వం నుంచి వచ్చిన తర్వాత ఈ వారాంతంలో సదరు సంస్థపై చర్యలు తీసుకునే దిశగా బృందాలు రెడీ అవుతున్నట్టు ప్రచారం.

నేటి నుంచి ఆర్టీసీ ఉద్యమం

- నేడు డిమాండ్స్ డే.. 21న రిలేదీక్షలు
- మహిళలు భారీ సంఖ్యలో పాల్గొనాలి
- టీజీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) పరిరక్షణ, కార్మికుల డిమాండ్ల సాధనలో భాగంగా కార్మిక సంఘాలు ఉద్యమ కార్యాచరణను ఉధృతం చేస్తున్నాయి. అందులోభాగంగా గురువారం డిమాండ్స్‌డేగా పాటిస్తామని, 21న రిలే నిరాహార దీక్షలు చేపడతామని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు జేఏసీ నేతలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దీక్షల్లో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మహిళా ఉద్యోగులు సమరంలో ముందుంటేనే సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని జేఏసీ అభిప్రాయపడింది. గురువారం నిర్వహించే డిమాండ్స్ డే కార్యక్రమంలో యూనియన్లకు అతీతంగా కార్మికులంతా భాగస్వాములు కావాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతలు కోరారు. డిమాండ్స్ బ్యాడ్జీలను ధరించి కార్మికులు విధులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సర్కారు నిధులతో మూడువేల ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేయాలని, ప్రతినెలా సంస్థకు రూ.430 కోట్లు రీయింబర్స్ చేయాలని డిమాండ్ చేశారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, రూట్ సర్వే చేసి రన్నింగ్ టైం ఇవ్వాలని, ఖాళీలను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని, టిమ్స్‌లో అవసరమైన మార్పులు చేయాలని కోరారు. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో కార్మికులపై పెట్టిన కేసులన్నింటినీ సానుభూతితో పరిశీలించి ఎత్తేయాలని, కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తివేసి, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఎస్బీటీ, ఎస్ఆర్‌బీఎస్ ట్రస్టులకు బోర్డు ఆఫ్ ట్రస్టీలను నియమించాలని, సీసీఎస్ ప్రతినిధుల కోసం ఎన్నికలు నిర్వహించేందుకు అనుమతించాలని కోరారు.

కొత్త ఈహెచ్‌ఎస్‌ను అమలు చేయాలి

- ప్రభుత్వానికి ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి
- ఉద్యోగ సంఘాలతో కలిసి ముసాయిదా రూపకల్పన
- వైద్యశాఖ మంత్రికి సమర్పించిన చైర్మన్ లచ్చిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులకు కొత్త ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కోరింది. ఈ మేరకు వివిధ ఉద్యోగ సంఘాలతో చర్చించి రూపొందించిన ముసాయిదాను ప్రభుత్వానికి ప్రతిపాదించింది. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డితోపాటు పలువురు జేఏసీ నాయకులు బుధవారం ఈ ముసాయిదాను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు అందజేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న హెల్త్ స్కీమ్‌లోని లోటుపాట్లు, కొత్తగా ప్రతిపాదించిన హెల్త్ స్కీమ్‌తో ఉద్యోగులకు, వారి కుటుంబాలకు కలిగే ప్రయోజనాలను మంత్రికి వివరించారు. కొత్త ప్రతిపాదనలతో ప్రభుత్వానికి భారం పడకుండా ఉద్యోగులకు ఇబ్బందులు తలెత్తకుండా వైద్యసేవలు అందుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, కే రామకృష్ణ, డాక్టర్ కత్తి జనార్దన్, దర్శన్‌గౌడ్, ఎస్ రాములు, డాక్టర్ వంశీకృష్ణ, దశరథ్, జయమ్మ, రమేశ్ పాక, రామ్‌ప్రతాప్ సింగ్, గోవర్ధన్, పాండు, దీపక్ పాల్గొన్నారు.

ప్రతిపాదనలోని కీలక అంశాలు

- తెలంగాణలో 3.06 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, 2.88 లక్షల మందికిపైగా పెన్షనర్లు ఉన్నారు.
- ప్రస్తుతం ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వం నెలకు దాదాపు రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నది.
- కొత్త ఈహెచ్ఎస్‌లో ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం ఎంప్యానెల్ చేసిన దవాఖానల్లో నగదురహిత వైద్యం అందించాలి.
- వైద్య చికిత్సకు అయ్యే ఖర్చుపై ఎలాంటి పరిమితి (సీలింగ్) విధించొద్దు.
- రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలతో పాటు స్థానిక సంస్థలు, ఎయిడెడ్, సొసైటీల ఉద్యోగులకు దీనిని అమలు చేయాలి.
- ప్రధాన కార్డుదారు సహా ఆరుగురు కుటుంబ సభ్యులకు సదుపాయం.
- ఈహెచ్ఎస్ కోసం అయ్యే మొత్తం ఖర్చును ఈహెచ్ఎస్ లేదా ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఏహెచ్‌సీటీ) ఖరారు చేయాలి.
- ఈ మొత్తంలో 50% ప్రభుత్వం భరించాలి. మిగతా 50 శాతాన్ని ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి తీసుకోవాలి.
- ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు చెల్లించే మొత్తాన్ని పేస్లిప్, పెన్షన్ స్లిప్‌లో డిడక్షన్స్‌గా చూపాలి. ప్రభుత్వం చెల్లించే మొత్తాన్ని ఎర్నింగ్స్‌లో నమోదు చేయాలి.
- ఈ మొత్తాన్ని సంబంధిత డీడీవో లేదా పీఆర్‌వో ప్రతినెలా ఈహెచ్ఎస్ ఖాతాలో జమచేయాలి.